MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక



ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 200 | బుధవారం 25 నవంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-

3,189 గ్రామాల్లో నేడు తొలి విడత పోరు

760 పంచాయతీల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లు
23 మున్సిపాలిటీల్లోనూ..

(అంకుశం, అమరావతి, నవంబర్ 25):

గ్రామ పంచాయతీ ఎన్నికల తొలి విడతలో 3,189 గ్రామాల్లో గురువారం పోలింగ్ జరగనుంది. తొలివిడత 3,949 పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేయగా ఇందులో 760 పంచాయతీల్లో సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖపట్నం, గుంటూరు మినహా 26 జిల్లాల్లోని 42 రెవెన్యూ డివిజన్లు, 201 మండలాల పరిధిలో ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు. అదేవిధంగా ఆయా పంచాయతీల పరిధిలోని 39,832 స్థానాలను నోటిఫై చేయగా 14,731 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. 25,057 వార్డు స్థానాలకు పోలింగ్ జరగనుండగా, 44 స్థానాల్లో నామినేషన్లు దాఖలు కాలేదు.

పోలింగ్ పర్యవేక్షణకు కెమెరాలు, వెబ్‌కాస్టింగ్..

పోలింగ్ స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. కెమెరాల కేటాయింపులో తిరుపతి జిల్లాకు అత్యధికంగా 825, అనకాపల్లికి 588, వైఎస్సార్ కడపకు 544 కెమెరాలు కేటాయించారు.

23 మున్సిపాలిటీల్లోనూ..

వివిధ కారణాల వల్ల ఎన్నికలు జరగని నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీల్లో గురువారం ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. ఈ ఎన్నికల్లో 4 మేయర్, 19 చైర్‌పర్సన్ పదవులకు మొత్తం 170 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అదేవిధంగా మొత్తం 1,010 వార్డు సభ్యుల స్థానాలకు గాను 41 స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.



ఏపీ సొంత ఆదాయం రూ.74,342 కోట్లు

సీఎం చంద్రబాబు సమీక్షలో వెల్లడి



(అంకుశం, అమరావతి, నవంబర్ 25):

2026--27 ఆర్థిక సంవత్సరంలో నవంబర్ 23 నాటికి రాష్ట్ర సొంత ఆదాయం రూ.74,342 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో రూ.62,604 కోట్లుగా ఉన్న ఆదాయం ఈసారి రూ.11,738 కోట్లు పెరిగి 18.7 శాతం వృద్ధి సాధించింది. ఆదాయార్జన శాఖలపై బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు సమీక్షించారు. ప్రజలపై అదనపు పన్నుల భారం మోపకుండా, ఛార్జీలు పెంచకుండానే ఆదాయం పెంచాలని సీఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రెండున్నరేళ్లుగా ప్రభుత్వ నిర్ణయాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని అన్నారు. పారదర్శకత, ఆన్‌లైన్ సేవలు, శాఖాపరమైన సంస్కరణలతో ఆదాయం పెరుగుతోందన్నారు. ప్రతీ వారం ఆదాయ ఆర్జనలపై దృష్టి సారిస్తూ... ఆ మేరకు నివేదికలు సిద్ధం చేసుకోవాలని... అవసరమైన మేరకు మార్పులు చేర్పులు చేసుకుంటూ మెరుగైన ఫలితాలు సాధించేలా చూడాలని అధికారులకు సీఎం సూచించారు. 2027 మార్చి నాటికి వంద శాతం వ్యవస్థల్లో మెరుగుదల చూపాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, గనులు, స్టాంపులు రిజిస్ట్రేషన్, పురపాలక, పంచాయితీరాజ్, అటవీశాఖల లాంటి ఆదాయార్జన శాఖలు సాంకేతికతను అమలు చేయాలని స్పష్టం చేశారు. భూముల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు తదితర అంశాలపై అధ్యయనం చేయాలని స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖకు సూచించారు. మద్యం తయారీ నుంచి విక్రయం వరకూ ట్రాకింగ్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖకు సీఎం దిశానిర్దేశం చేశారు. వాహనాల లోడ్, ఇ--వేబిల్స్ సహా వివిధ అంశాలపై రవాణా శాఖ ఎలక్ట్రానిక్ విధానంలో పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. ఏప్రిల్ 1 నుంచి నవంబర్ 20 వరకు పంచాయతీలకు సుమారు రూ.239 కోట్లు, ఇదే కాలంలో పట్టణ స్థానిక సంస్థలకు సుమారు రూ.2,366 కోట్ల పన్ను ఆదాయం వచ్చిందని అధికారులు సమీక్షలో వివరించారు. ఆస్తిపన్ను వసూళ్లను మెరుగుపర్చేందుకు 123 పట్టణ స్థానిక సంస్థల్లో ఏఐ ఆధారిత వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలో గత ఏడాది రూ.1,015 కోట్ల పన్నుల్ని డిజిటల్ గానే వసూలు చేసినట్లు అధికారులు తెలియచేశారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఆర్థిక, రెవెన్యూ, ఎక్సైజ్, స్టాంపులు--రిజిస్ట్రేషన్లు, గనులు, రవాణా, పురపాలక, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తిరుమలలో 29న కార్తీక వన భోజనం

అంకుశం న్యూస్ తిరుమల నవంబర్ 25

కార్తీక వన భోజన కార్యక్రమం నవంబరు 29వ తేది తిరుమలలోని గోగర్భం సమీపంలో గల పార్వేటమండపంలో జరుగనుంది. పవిత్రమైన కార్తీకమాసంలో వనభోజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఉదయం 8.30 గంటలకు శ్రీ మలయప్పస్వామివారు చిన్న గజవాహనంపై, ఉభయనాంచారులు పల్లకిపై ఆలయంనుంచి బయలుదేరి ఊరేగింపుగా పార్వేటమండపానికి వేంచేపు చేస్తారు. ఉదయం 11 నుండి 12 గంటల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహిసారు. ఈ సందర్భంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేస్తారు. అటు పిమ్మట మధ్యాహ్నం 1 నుండి 2 గంటల నడుమ కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ ఉత్సవం కారణంగా శ్రీవారి అలయంలో నిర్వహించు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవలను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఉన్నతాధికారులు మరియు సిబ్బంది పాల్గొంటారు.



కొత్త పింఛన్లకు నగదు జమ!

- అచ్చంపేట వేదికగా సీఎం రేవంత్ బటన్ నొక్కి విడుదల
- 4.72 లక్షల మందికి పింఛన్ కానుక!
- రేపటి నుంచి కొత్త పింఛన్ల పంపిణీ
- ఒకే వేదికపై రెండు సంక్షేమ కార్యక్రమాలు



హైదరాబాద్

తెలంగాణలో కొత్తగా పింఛన్ల మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. నెలల తరబడి నగదు కోసం ఎదురుచూస్తున్న వారికి గురువారం (నవంబర్ 26) నుంచి పింఛన్ సొమ్ము అందించేందుకు ఏర్పాట్లు చేసింది. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త పింఛన్ల నగదును విడుదల చేయనున్నారు. చేయూత పథకం కింద అర్హులైన ప్రతి లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో రూ.2 వేల - మిగతా 3లో

సముద్రంలో చిక్కుకున్న మత్స్యకారులు క్షేమం



(అంకుశం, అమరావతి, నవంబర్ 25):

రోజుల తరబడి గుండెలు అరచేతిలో పెట్టుకుని ఎదురుచూసిన కుటుంబాలకు చివరకు ఊరటనిచ్చే వార్త వచ్చింది. సముద్రంలో ఇంజిన్ ఆగిపోయి నిలిచిపోయిన బోటులో చిక్కుకున్న ఆరుగురు మత్స్యకారులు క్షేమంగా ఉన్నారని మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం ప్రకటించారు. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలంలోని సుబ్బంపేటకు చెందిన సోరాడ కొండబ్రావు, గుంపల ప్రకాశు, తిర్రి నారాయణ, సోరాడ చిన్న, మెరుగు నారాయణ, కండల రాము ఈ నెల 10న బోటులో చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. 15వ తేదీ నుంచి వారి ఫోన్లు పని చేయకపోవడంతో కుటుంబ సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రభుత్వం సంబంధిత అధికారులను రంగంలోకి దింపి వారి ఆచూకీ కనుగొనేందుకు కోస్ట్‌గార్డ్, నౌకాదళాన్ని అప్రమత్తం చేశారు. గాలింపులో భాగంగా ఉప్పాడ--తుని తీరంలోని కృష్ణాపురం సమీపంలో తీరానికి 3 కిలోమీటర్ల దూరంలో బోటు నిలిచిపోయినట్లు గుర్తించారు. సముద్రంలో నీటి లోతు తక్కువగా ఉండటంతో మరో బోటు సహాయంతో మత్స్యకారులను తీరానికి చేర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.

నాలుగు రంగాలకు కొత్త ఊతం

న్యూఢిల్లీ: దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశ్రామిక ఉత్పత్తి, రవాణా వ్యవస్థల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో మొత్తం రూ.19,934 కోట్ల విలువైన ఐదు కీలక ప్రాజెక్టులు, పథకాలకు ఆమోదం లభించింది. ఈ విషయాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. దేశీయంగా నిర్మాణ, మౌలిక సదుపాయాల పరికరాల తయారీని ప్రోత్సహించేందుకు అత్యధికంగా రూ.11,000 కోట్లు కేటాయించడం ఈ నిర్ణయాల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. వీటితోపాటు తమిళనాడులోని కామరాజర్ పోర్టులో రెండో కంటైనర్ టెర్మినల్ నిర్మాణం, అస్సాంలో కొత్త గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు, తపాలా శాఖ కార్యకలాపాలు, ఆస్తుల నిర్వహణకు సంబంధించిన రెండు పథకాలకు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులు అమలులోకి వస్తే పారిశ్రామిక రంగంలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు దేశ రవాణా, వాణిజ్య వ్యవస్థలకు మరింత బలం చేకూరనుంది.

ఐదు ప్రాజెక్టులు.. నిధుల కేటాయింపు ఇలా!

కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన ఐదు ప్రాజెక్టులు, పథకాలకు సంబంధించిన నిధుల వివరాలు ఇలా ఉన్నాయి.
జ×జు మ్యానుఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్: రూ.11,000 కోట్లు
కామరాజర్ పోర్టు రెండో కంటైనర్ టెర్మినల్: రూ.4,288 కోట్లు
డోలు గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం: రూ.2,014 కోట్లు
పోస్టల్ ఆపరేషన్స్ స్కీమ్: రూ.1,141 కోట్లు
ఎస్టేట్ మేనేజ్‌మెంట్ స్కీమ్: రూ.1,491 కోట్లు
మొత్తం కేటాయింపు: రూ.19,934 కోట్లు.

దేశీయ యంత్రాల తయారీకి రూ.11 వేల కోట్లు

కేంద్ర కేబినెట్ నిర్ణయాల్లో నిర్మాణ, మౌలిక సదుపాయాల పరికరాల తయారీ రంగానికి సంబంధించిన జ×జు మ్యానుఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్ పథకానికి అత్యధికంగా రూ.11,000 కోట్లు కేటాయించారు. దేశంలో నిర్మాణ రంగానికి అవసరమైన భారీ యంత్రాలు, ఆధునిక పరికరాల తయారీని ప్రోత్సహించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం రహదారులు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాలు, ఇతర భారీ నిర్మాణ ప్రాజెక్టుల్లో వినియోగించే అనేక రకాల యంత్రాలు, పరికరాల కోసం విదేశీ దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని మార్చి దేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంచడంపై కేంద్రం దృష్టి సారించింది. ఈ పథకం ద్వారా భారతీయ తయారీ సంస్థలకు పెట్టుబడులు, ఉత్పత్తి విస్తరణకు ప్రోత్సాహం లభించనుంది. దిగుమతులపై



ఆధారపడటం తగ్గించడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లో భారతీయ కంపెనీలు పోటీపడేందుకు అవకాశాలు మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.
అలాగే యంత్రాల తయారీకి అవసరమైన విడిభాగాల పరిశ్రమలు, అనుబంధ ఉత్పత్తి సంస్థలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.

కామరాజర్ పోర్టులో రెండో టెర్మినల్

తమిళనాడులోని కామరాజర్ పోర్టు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఇక్కడ రెండో కంటైనర్ టెర్మినల్ నిర్మాణానికి రూ.4,288 కోట్లను కేటాయిస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశ విదేశీ వాణిజ్యంలో సముద్ర రవాణా కీలక పాత్ర పోషిస్తోంది. దిగుమతులు, ఎగుమతుల కోసం కంటైనర్ రవాణా సామర్థ్యాన్ని పెంచడం అవసరంగా మారింది. ఈ నేపథ్యంలో రెండో టెర్మినల్ నిర్మాణం పూర్తయితే పోర్టులో సరుకు నిర్వహణ సామర్థ్యం పెరగడంతోపాటు రవాణా కార్యకలాపాలు మరింత వేగవంతం కానున్నాయి. పారిశ్రామిక సంస్థలు, ఎగుమతిదారులు, దిగుమతిదారులకు మెరుగైన రవాణా సదుపాయాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. తమిళనాడు వాణిజ్య, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదపడనుంది.

అస్సాంలో కొత్త విమానాశ్రయం

ఈశాన్య భారతదేశంలో విమానయాన మౌలిక సదుపాయాలను విస్తరించేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. అస్సాంలోని కాచార్ జిల్లా డోలు ప్రాంతంలో కొత్త గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణానికి రూ.2,014 కోట్ల నిధులతో ఆమోదం తెలిపింది. గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం అంటే ఇప్పటికే ఉన్న విమానాశ్రయాన్ని విస్తరించడం కాకుండా కొత్త ప్రదేశంలో పూర్తిస్థాయిలో విమానాశ్రయాన్ని నిర్మించడం. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే సిల్చార్‌తోపాటు పరిసర ప్రాంతాల ప్రజలకు విమాన ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ముఖ్యంగా వ్యాపార కార్యకలాపాలు, పర్యాటక రంగం, పెట్టుబడుల రాకకు అనుకూల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. ఈశాన్య రాష్ట్రాల రవాణా అనుసంధానాన్ని బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.

తపాలా శాఖకు రూ.2,632 కోట్లు

దేశవ్యాప్తంగా తపాలా సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం రెండు ప్రత్యేక పథకాలకు ఆమోదం తెలిపింది. ఈ రెండు పథకాలకు కలిపి రూ.2,632 కోట్లను కేటాయించింది.

1. పోస్టల్ ఆపరేషన్స్ స్కీమ్ -- రూ.1,141 కోట్లు

తపాలా శాఖ రోజువారీ కార్యకలాపాలను మెరుగుపరచడం, సేవల సామర్థ్యాన్ని పెంచడం, కార్యకలాపాల నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం ఈ పథకం లక్ష్యం. దేశవ్యాప్తంగా పోస్టల్ సేవలను మెరుగుపరిచి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయి.

2. ఎస్టేట్ మేనేజ్‌మెంట్ స్కీమ్ -- రూ.1,491 కోట్లు

తపాలా శాఖకు దేశవ్యాప్తంగా ఉన్న భవనాలు, భూములు, ఇతర స్థిరాస్తుల నిర్వహణను మెరుగుపరచడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వ ఆస్తులను సమర్థంగా వినియోగించుకోవడం, వాటి నిర్వహణలో మెరుగైన విధానాలను అమలు చేయడం ద్వారా శాఖ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

నాలుగు రంగాలకు కొత్త ఊతం

కేంద్ర కేబినెట్ తీసుకున్న ఈ నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థలోని కీలక రంగాల అభివృద్ధికి దోహదపడనున్నాయి. నిర్మాణ, మౌలిక సదుపాయాల పరికరాల తయారీకి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం ద్వారా దేశీయ పారిశ్రామిక ఉత్పత్తికి ప్రోత్సాహం లభించనుంది. కామరాజర్ పోర్టు విస్తరణతో సముద్ర వాణిజ్యానికి, డోలు విమానాశ్రయంతో ఈశాన్య ప్రాంతాల రవాణా అనుసంధానానికి ప్రయోజనం కలగనుంది. మరోవైపు తపాలా శాఖలో కార్యకలాపాలు, ఆస్తుల నిర్వహణ మెరుగుపడే అవకాశం ఉంది. మొత్తంగా రూ.19,934 కోట్ల విలువైన ఈ ఐదు ప్రాజెక్టులు, పథకాల ద్వారా దేశీయ తయారీ సామర్థ్యం పెంపు, రవాణా మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రభుత్వ సేవల ఆధునికీకరణకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. వీటి అమలు, పురోగతిని బట్టి దేశ ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పనపై ప్రయోజనాలు ఆధారపడి ఉంటాయి.

భారత్ అభివృద్ధి చెందడం ప్రపంచ శక్తులకు ఇష్టం లేదు

ఛత్రపతి శంభాజీనగర్: ప్రపంచంలో ఆధిపత్యాన్ని కొనసాగించాలని కోరుకుంటున్న శక్తులకు భారత్ అభివృద్ధి చెందడం ఇష్టం లేదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ వ్యాఖ్యానించారు. ప్రపంచంలోని అగ్రశక్తులు ఇతర దేశాలను తమ ఒత్తిడిలో ఉంచుతూ ఆధిపత్యాన్ని చెలాయించాలనే ఆలోచనతో వ్యవహరిస్తున్నాయని అన్నారు. అయితే భారత్ మాత్రం తనను వ్యతిరేకించే, ద్వేషించే పొరుగు దేశాలకు సైతం ఆపద సమయంలో సహాయం చేసేందుకు ముందుంటుందని స్పష్టం చేశారు. బలహీనులను రక్షించడం, ప్రపంచంలో శాంతిని నెలకొల్పడమే నిజమైన శక్తికి అర్థమని పేర్కొన్నారు. బుధవారం మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో నిర్వహించిన ఐదో పద్మ ఫెస్టివల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని జ్ఞానయజ్ఞ ఫౌండేషన్ నిర్వహించింది. వివిధ రంగాల్లో విశేష సేవలందించి పద్మ పురస్కారాలు పొందిన ప్రముఖులు ఇందులో పాల్గొన్నారు.

ఆధిపత్యమే అగ్రశక్తుల లక్ష్యం

ప్రస్తుత ప్రపంచ పరిస్థితులు విచిత్రంగా ఉన్నాయని మోహన్ భగవత్ అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోని కొన్ని శక్తిమంతమైన దేశాలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నాయని, 'బలవంతుడిదే రాజ్యం' అనే సూత్రాన్ని అనుసరిస్తున్నాయని పేర్కొన్నారు. ఇతర దేశాలను ఒత్తిడిలో ఉంచడం ద్వారానే తమ శక్తిని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. భారత్ అభివృద్ధి చెందితే ఇతర దేశాలపై ఆధిపత్యం చెలాయించే వారి వ్యూహాలు దెబ్బతింటాయని వ్యాఖ్యానించారు. భారత్ ఎదగాలని కోరుకునే ఉద్దేశం అందరికీ సహాయం చేయడమేనని, అందుకే భారత పురోగతి కొన్ని ప్రపంచ శక్తులకు ఇష్టం లేదని అన్నారు.

ద్వేషించే దేశాలకూ సాయం చేస్తాం

భారతదేశం అనుసరిస్తున్న విదేశాంగ, మానవతా దృక్పథాన్ని



వివరిస్తూ మోహన్ భగవత్ పలు ఉదాహరణలు ప్రస్తావించారు. మాల్దీవులు నీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు భారత్ తాగునీటిని సరఫరా చేసిందని గుర్తుచేశారు. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న శ్రీలంకకు ఆర్థిక సహాయం అందించిందని తెలిపారు. నేపాల్ పర్యావరణ విపత్తులను ఎదుర్కొన్నప్పుడు అండగా నిలిచిందని, బంగ్లాదేశ్‌కు కూడా అవసరమైన సందర్భాల్లో సహాయం చేసిందని పేర్కొన్నారు. వరదలు, భూకంపాల వంటి విపత్తుల సమయంలో పాకిస్థాన్‌కు సైతం భారత్ సహాయం అందించిన విషయాన్ని ప్రస్తావించారు. దేశాల మధ్య రాజకీయ విభేదాలు, వైరుధ్యాలు ఉన్నప్పటికీ మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇతరులపై ఆధిపత్యం చెలాయించడం శక్తికి నిదర్శనం కాదని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, బలహీనులను రక్షించడం, శాంతిని నెలకొల్పడమే నిజమైన బలమని పేర్కొన్నారు. ఇదే భారతదేశ సంస్కృతి, తత్వమని వివరించారు.

యువతలో బానిసత్వ భావజాలం తగ్గింది

నేటి యువతరంలో ఆలోచనా విధానం మారుతోందని భగవత్ పేర్కొన్నారు. యువత బానిసత్వ భావజాలం నుంచి బయటపడుతోందని, నిజాయతీగా మాట్లాడే వ్యక్తులకు మద్దతుగా నిలిచేందుకు సిద్ధంగా ఉంటోందని అన్నారు. అబద్ధాలను యువత ద్వేషిస్తోందని, దేశాన్ని గొప్పగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో ప్రతి అంశాన్ని పరిశీలిస్తోందని ప్రశంసించారు. దేశ భవిష్యత్తును నిర్మించడంలో యువత పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.

మంచి పనులను ఆదర్శంగా తీసుకోవాలి

సమాజంలో మంచి పనులు చేస్తున్న వ్యక్తుల ఉద్దేశాలను అనవసరంగా శంకించకూడదని భగవత్ సూచించారు. వారి సేవలను, కృషిని గుర్తించి వాటి నుంచి స్ఫూర్తి పొందాలని అన్నారు. ఎవరైనా స్వార్థ ప్రయోజనాలతో ఒక మంచి పని చేసినప్పటికీ, వారి ఉద్దేశాలను పక్కనపెట్టి ఆ పనిలోని మంచిని స్వీకరించాలని సూచించారు. మంచి పనులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని, తదుపరి తరాలు కూడా వాటిని కొనసాగించాలని అభిప్రాయపడ్డారు.

పద్మ పురస్కార గ్రహీతల సేవలు ప్రశంసనీయం

వివిధ రంగాల్లో పద్మ పురస్కారాలు అందుకున్న ప్రముఖుల సేవలను మోహన్ భగవత్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఉన్నతమైన ఆశయాలతో, దృఢ సంకల్పంతో పనిచేసిన ఈ వ్యక్తులు లక్షలాది మంది జీవితాల్లో మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. వారు సాధించిన విజయాలు, సమాజానికి అందించిన సేవల ద్వారా పొందిన సంతృప్తి వెలకట్టలేనిదని పేర్కొన్నారు. అలాంటి ప్రముఖులతో ప్రజలు నేరుగా మాట్లాడేందుకు, వారి అనుభవాలు తెలుసుకునేందుకు పద్మ ఫెస్టివల్ మంచి వేదికగా నిలుస్తోందని అన్నారు.
ప్రస్తుత అంతర్జాతీయ భద్రతా పరిస్థితులు సున్నితమైన దశలో ఉన్నాయని, ప్రపంచ శక్తుల మధ్య సమతుల్యత మారుతోందని అనిల్ చౌహాన్ అభిప్రాయపడ్డారు. భారత్ అభివృద్ధి, ప్రభావవంతమైన దేశంగా ఎదిగే క్రమంలో అభివృద్ధి చెందిన దేశాల నుంచి అడ్డంకులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. అయితే బాహ్య ప్రమాదాల కంటే అంతర్గత ముప్పులే మరింత ప్రమాదకరమని పేర్కొన్నారు.

మహేంద్రవాడ సర్పంచ్ పోటీలో పెద్ద సత్తిరెడ్డి

తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 25: వైసీపీకి మంచి పట్టున్న అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామంలో సర్పంచ్ ఎన్నిక ఊహించని మలుపు తిరిగింది. కూటమికి ఏకగ్రీవం అవుతుందని భావించిన దశలో సబ్బెళ్ళ పెద్ద సత్తిరెడ్డి పోటీలోకి దిగడంతో గ్రామ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, గ్రామ వైసీపీ నేతలు,కార్యకర్తల అండతో పెద్ద సత్తిరెడ్డి తనదైనశైలిలో ప్రచారం కొనసాగిస్తున్నారు.తనకు కేటాయించిన "క్యారెట్" గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన ఓటర్లను కోరుతున్నారు.ఈ సందర్భంగా పెద్ద సత్తిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ శ్రేణుల సహకారంతో ముందుకు వెళ్తున్నానని చెప్పారు. ప్రజల్లో ఉంటూ తాను చేసిన సేవలను ప్రజలు గుర్తించి తనను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.



వైఎస్సార్ పార్టీ తరపున మాజీఎమ్మెల్యే భార్య

తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 25: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి స్వగ్రామం పొలమూరులో ఆయన సతీమణి ఆదిలక్ష్మి వైయస్సార్సీపి తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల తరపున జోరుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బుధవారం ఇంటింటికి తిరిగి ఈనెల 29న జరిగే పంచాయితీ ఎన్నికల్లో పొలమూరు సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సత్తి ఆదిలక్ష్మి కనకారెడ్డి,వార్డు సభ్యులను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను సత్తి ఆదిలక్ష్మి కోరారు.కాగా ఇక్కడ గమ్మత్తైన విషయం పాలమూరు సర్పంచ్ అభ్యర్థిగా పోటీలో ఉన్న సత్తి ఆదిలక్ష్మి పేరు ఎన్నికల ప్రచారం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి సతీమణి పేరు కూడా సత్తి ఆదిలక్ష్మి కావడం విశేషం. పొలమూరు మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి స్వగ్రామం కావడం, సర్పంచ్ అభ్యర్థి సత్తి ఆదిలక్ష్మి కి గ్రామంలో పెద్ద సంఖ్యలో బంధు వర్గం ఉండటంతో ఆదిలక్ష్మి విజయానికి కలిసొచ్చే అంశంగా పలువురు పేర్కొంటున్నారు. ప్రచార కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సత్తి గీతా వరలక్ష్మి వెంకటరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, సత్తి కనకారెడ్డి, భారీ ఎత్తున మహిళలు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ సమరశంఖం..

న్యూఢిల్లీ: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 26న దేశవ్యాప్తంగా 'సంవిధాన్ రక్షా మార్చ్' పేరుతో నిరసన ర్యాలీలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఓటు చోరీ, ఓటర్ల జాబితాలో అక్రమాలు, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు వ్యతిరేకంగా ఈ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ప్రకటించింది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలు (పీసీసీలు) ఈ ర్యాలీలను నిర్వహించనున్నాయి. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగే ప్రధాన కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొననున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. 2027లో పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ చేపడుతోంది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు.

ఓటు హక్కును కాపాడుకోవడమే లక్ష్యం

ప్రజాస్వామ్యంలో పౌరుడికి ఉన్న ఓటు హక్కు అత్యంత కీలకమని కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. ఓటు హక్కుకు భంగం కలిగితే రాజ్యాంగం కల్పించిన ఇతర హక్కుల పరిరక్షణ కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని వ్యాఖ్యానించారు. ఓటు చోరీపై కాంగ్రెస్ చేస్తున్న పోరాటం కేవలం ఒక రాజకీయ పార్టీకి సంబంధించిన అంశం కాదని, దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుకు సంబంధించిన విషయమని అన్నారు. విద్యార్థులు, యువత, రైతులు, కార్మికులు, మహిళలు, దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, మైనారిటీలతోపాటు రాజ్యాంగ విలువలను గౌరవించే ప్రతి ఒక్కరూ ఈ ర్యాలీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నవంబర్ 26ను రాజ్యాంగ పరిరక్షణకు సంబంధించి చారిత్రాత్మక సంకల్ప దినంగా మార్చాలని కోరారు.

రాహుల్ వెల్లడించిన ఆధారాలపై విచారణ ఏది?

ఎన్నికల జాబితాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పలు సందర్భాల్లో ఆధారాలను వెల్లడించారని కేసీ వేణుగోపాల్ గుర్తుచేశారు. కర్ణాటకలోని మహదేవపుర నియోజకవర్గంలో నకిలీ, డూప్లికేట్ ఓటర్ల నమోదులు ఉన్నాయని రాహుల్ ఆరోపించిన విషయాన్ని ప్రస్తావించారు. ఆలంద్ నియోజకవర్గంలో నిజమైన ఓటర్ల పేర్లను తొలగించేందుకు వ్యవస్థీకృత ప్రయత్నాలు జరిగాయని ఆయన చేసిన ఆరోపణలను కూడా ప్రస్తావించారు. హరియాణాతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ ఎన్నికల అక్రమాలు చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ అంశాలపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. అయితే తమ నేతలు వెల్లడించిన ఆధారాలపై ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోలేదని కేసీ వేణుగోపాల్ విమర్శించారు. ఎన్నికల సంఘం ప్రతిపక్ష నేతను అఫిడవిట్లు సమర్పించాలని కోరిందని, తమ ఆరోపణలపై సమగ్ర విచారణ జరగలేదని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇవన్నీ కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలేనని, వాటిపై ఎన్నికల సంఘం అధికారిక వివరణను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

ప్రతి పోలింగ్ బూత్‌కు 'ఓట్ రక్షక్' కార్యక్రమం

సంవిధాన్ రక్షా మార్చ్‌తోపాటు 'ఓట్ రక్షక్' పేరుతో మరో కార్యక్రమాన్ని కూడా కాంగ్రెస్ చేపట్టనుంది. ఇందులో భాగంగా పార్టీ కార్యకర్తలు ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో పర్యటించి ఓటర్ల జాబితాల నుంచి పేర్లు తొలగించబడిన వారి వివరాలను పరిశీలించనున్నారు. అర్హత ఉన్నప్పటికీ ఓటు హక్కు కోల్పోయిన వారిని గుర్తించి, తిరిగి ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు అవసరమైన సహాయం అందించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమం ద్వారా ఓటర్ల జాబితాల్లో ఉన్న తప్పులను గుర్తించడం, అర్హులైన పౌరులకు ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేయడం తమ లక్ష్యమని కేసీ వేణుగోపాల్ తెలిపారు.

నాగ్‌పూర్‌లో సీజేపీ 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీ

మరోవైపు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ 'సేవ్ డెమోక్రసీ, సేవ్ కానిస్టిట్యూషన్' పేరుతో ర్యాలీ నిర్వహించనుంది. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. నవంబర్ 26న సాయంత్రం 4 గంటలకు నాగ్‌పూర్‌లోని సంవిధాన్ చౌక్ వద్ద ఈ కార్యక్రమం జరగనుంది. ఎన్నికల సంఘం పనితీరు, ఎస్ఐఆర్ ప్రక్రియపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని సీజేపీ పేర్కొంది. ఓటర్ల జాబితాల సవరణలో పారదర్శకత, ఎన్నికల సంఘం జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేస్తోంది. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ఉద్దేశమని అభిజీత్ దీప్కే వెల్లడించారు.

మత రాజకీయాలు కాదు.. ప్రజా సమస్యలే ప్రాధాన్యం

వచ్చే ఏడాది ప్రారంభంలో పలు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలపై కూడా అభిజీత్ దీప్కే స్పందించారు. తమ పార్టీ నేరుగా ఎన్నికల్లో పోటీ చేయబోదని, ఏ రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వబోదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో మందిర్-మసీదు అంశాలకంటే ప్రజలకు సంబంధించిన వాస్తవ సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. విద్య, వైద్యం, నిరుద్యోగం, సెమీకండక్టర్ల పరిశ్రమ, పునరుత్పాదక ఇంధనం, సాంకేతిక పరిజ్ఞానం, రవాణా వంటి అంశాలపై రాజకీయ పార్టీలు దృష్టి సారించేలా ప్రజల్లో చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువలపై అవగాహన పెంచడమే తమ కార్యక్రమాల ఉద్దేశమని తెలిపారు.

ట్రంప్ సర్కారు కొత్త వడ్డింపులు



భారతదేశం నుంచి దిగుమతయ్యే వస్తువులపై 17 శాతం అదనపు సుంకాలు (టారిఫ్‌లు) విధించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం సరికొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. తమ ప్రధాన వాణిజ్య భాగస్వామ్య దేశాల్లో నెలకొన్న మితిమీరిన తయారీ సామర్థ్యం, అవసరానికి మించిన ఉత్పత్తిని నియంత్రించే లక్ష్యంతో అమెరికా కొత్త వాణిజ్య విధానాన్ని (ట్రేడ్ ఫ్రేమ్‌వర్క్) ప్రకటించింది. ఇందులో భాగంగా భారత్‌తో సహా మొత్తం 14 దేశాలను లక్ష్యంగా చేసుకుని ఈ సరికొత్త పన్నుల విధానాన్ని రూపొందించింది. అమెరికా వాణిజ్య ప్రతినిధి (యూఎస్‌టీఆర్) కార్యాలయం విడుదల చేసిన ప్రాథమిక జాబితా ప్రకారం, భారత ఎగుమతులపై గరిష్ఠంగా 25 శాతం వరకు సుంకాలు పడే ప్రమాదం ఉంది. అయితే, ట్రంప్ ప్రభుత్వంతో న్యూఢిల్లీ సమగ్ర వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటే ఈ రేటును 17 శాతానికి తగ్గిస్తామని స్పష్టం చేసింది. ఈ కొత్త వాణిజ్య చర్యల పరిధిలోకి భారత్‌తో పాటు చైనా, యూరోపియన్ యూనియన్ (ఈయూ), జపాన్, దక్షిణ కొరియా, వియత్నాం, బంగ్లాదేశ్ వంటి ప్రధాన ఆర్థిక వ్యవస్థలను చేర్చారు. మార్కెట్ వాస్తవ డిమాండ్‌కు మించి ఇతర దేశాల ప్రభుత్వాలు తమ పరిశ్రమల్లో అధిక సామర్థ్యాన్ని, మితిమీరిన ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నాయా అనే అంశంపై యూఎస్‌టీఆర్ గత మార్చి నెలలో దర్యాప్తు ప్రారంభించింది. కొన్ని దేశాలు అవసరానికి మించి వస్తువులను ఉత్పత్తి చేసి గ్లోబల్ మార్కెట్లలో డంపింగ్ చేస్తుండటం వల్ల ధరలు భారీగా పడిపోతున్నాయని అమెరికా వాదిస్తోంది. ఇది ప్రపంచ వాణిజ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేయడమే కాకుండా, అమెరికాలోని స్థానిక తయారీ రంగానికి తీవ్ర నష్టం కలిగిస్తోందని, స్వదేశీ కంపెనీలు పోటీ పడటం కష్టతరంగా మారుతోందని వాషింగ్టన్ ఆరోపిస్తోంది. ఈ విచారణ పరిధిలో బ్యాటరీలు, సిమెంట్, రసాయనాలు, ప్రాసెస్డ్ ఫుడ్ వంటి విస్తృత రంగాలు ఉన్నాయి. అయితే, ఈ ప్రతిపాదిత సుంకాలు తక్షణమే అమల్లోకి రావడం లేదు. తుది నిర్ణయం తీసుకోవడానికి ముందు వ్యాపార వర్గాలు, పరిశ్రమల భాగస్వాముల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు యూఎస్ యంత్రాంగం ప్రజాభిప్రాయ సేకరణను ప్రారంభించింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత, పరిస్థితులు అనుకూలిస్తే వచ్చే ఏడాది జనవరి నాటికి ఈ సుంకాలు అమల్లోకి రావచ్చని అమెరికా సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. గతంలో ట్రంప్ ప్రభుత్వం విధించిన గ్లోబల్ టారిఫ్‌లను చెల్లవంటూ, అధ్యక్షుడికి ఆ విధమైన చట్టబద్ధమైన అధికారం లేదని పేర్కొంటూ అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసిన కొన్ని నెలలకే ఈ తాజా పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ప్రస్తుతం అమెరికాలో ఆటోమొబైల్స్, స్టీల్ వంటి నిర్దిష్ట రంగాలపై మాత్రమే ప్రత్యేక సుంకాలు కొనసాగుతున్నాయి.

రాచేపల్లి సర్పంచ్‌గా ఎమ్మెస్ ఉమాదేవి ఏకగ్రీవ ఎన్నిక....



అంకుశం న్యూస్,శింగనమల,నవంబర్ :25 అనంతపురం జిల్లా సింగనమల మండలం రాచేపల్లి గ్రామ సర్పంచ్‌గా ఎమ్మెస్ ఉమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం పంచాయతీ కార్యాలయంలో అధికారులు ఆమెకు ఎన్నికైనట్లు ధ్రువీకరిస్తూ డిక్లరేషన్ పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్ద ఎత్తున ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఉమాదేవికి అభినందనలు తెలిపారు. గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామ అభివృద్ధికి ఉమాదేవి కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు.

పోలింగ్ కేంద్రాల్లో లోటుపాట్లు లేకుండా చూడాలి: అసిస్టెంట్ కలెక్టర్ సుయష్ కుమార్



రాప్తాడు అంకుశం న్యూస్ నవంబర్ 25 మండలంలో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకుజరగనున్న పోలింగ్‌తో పాటు, అనంతరం నిర్వహించనున్న కౌంటింగ్‌కు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సుయష్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని రాప్తాడు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఎన్నికల సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం మధ్యాహ్నం ఆయన పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఉన్న 16 గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రిని ప్రిసైడింగ్ ఆఫీసర్లు, సహాయ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు అధికారులు అందజేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం బాధ్యతలు నిర్వర్తించాలని సిబ్బందికి పలు కీలక సలహాలు, సూచనలు చేశారు. ఎంపీడీవో బి. విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు అచ్యుత్ బాబు, అశోక్ బాబు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



అంకుశం న్యూస్ ధర్మవరం,నవంబర్ 25: శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ నేడు ధర్మవరం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న ఈవీఎం మరియు వీవీప్యాట్ గోదామును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నెలవారీ తనిఖీలలో భాగంగా ఈ పర్యటన చేపట్టారు. గోదాము వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతా వ్యవస్థను, పోలీసు బందోబస్తును కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు.గోదాము లోపల మరియు వెలుపల అమర్చిన సీసీటీవీ కెమెరాల పనితీరును, కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. సాంకేతిక లోపాలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.స్ట్రాంగ్ రూమ్ తలుపులకు వేసిన సీళ్లను పరిశీలించి, భద్రతా సిబ్బంది నిర్వహిస్తున్న లాగ్ బుక్ మరియు సందర్శకుల రిజిస్టర్లను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈవీఎం గోదాము భద్రత విషయంలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా అధికారులు, పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను తూ.చ. తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ధర్మవరం ఆర్డీఓ రామ్ భూపాల్ రెడ్డి, ధర్మవరం మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య, తహసీల్దార్దేవరాజు, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రీసర్వే గ్రౌండ్ ట్రూథింగ్ పనులు వేగవంతం చేయండి

- : జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్..



అంకుశం న్యూస్అనంతపురం, నవంబర్ 25 : - అనంతపురం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోలిరీసర్వే గ్రౌండ్ ట్రూథింగ్ పనులు వేగవంతం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. బుధవారం పామిడి మండలంలోని పామిడి గ్రామాన్ని సందర్శించి, మండలంలో జరుగుతున్న రీసర్వే గ్రౌండ్ ట్రూథింగ్ పనులను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే ట్రూథింగ్ పనులు మందకొడిగా సాగుతున్నందున, వాటిని వేగవంతం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శర్మిల, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్‌కు పటిష్ట భద్రత

ఈనెల 26న జిల్లాలోని 13 మండలాలలో తొలివిడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్

అదే రోజున పోలింగ్ అనంతరం కౌంటింగ్ ప్రక్రియ

అనంత జిల్లా ఎస్పీ పి. జగదీష్



అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం నవంబర్ 25 అనంతపురం జిల్లాలో కొన్ని ప్రాంతాల్లోఈనెల 26న జిల్లాలోని 13 మండలాలలో తొలివిడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్, అదే రోజున కౌంటింగ్ ప్రక్రియ జరగనున్న నేపథ్యంలో పటిష్ట భద్రతా చర్యలు తీసుకున్నామని అవసరమైన డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామని సమస్యాత్మక ప్రాంతాలు సున్నితమైన ప్రాంతాలపై ప్రత్యేక నిగా ఉంచి ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామనిలిజిల్లా ఎస్పీ పి. జగదీష్ తెలిపారు ఈసందర్భంగా జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ... ప్రతి ఓటరు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్ట భద్రత కల్పించాలని ఆదేశించారు. ప్రతి పోలీసు సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలు, రూట్లు, సమస్యాత్మక ప్రాంతాలు, విధుల పరిధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధిని స్పష్టంగా గుర్తించి, ఆ పరిధిలోకి అనుమతి లేని వ్యక్తులు, వాహనాలను అనుమతించరాదని, వాహనాల పార్కింగ్‌ను నిర్దేశిత పరిధికి వెలుపల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 200 మీటర్ల పరిధిలో ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఆంక్షలు అమలు చేస్తూ... ప్రచారం, గుంపులుగా చేరడం వంటి చర్యలకు తావులేకుండా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు, రూట్ మొబైల్ సిబ్బంది తమకు కేటాయించిన మార్గాల్లో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ సమస్యాత్మక, సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ జగదీష్ సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో సైరన్, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా ప్రజలకు సూచనలు చేస్తూ పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. విధులకు హాజరయ్యే ప్రతి పోలీసు సిబ్బంది నీట్‌గా యూనిఫాం ధరించి, లాఠీ, విజిల్, అవసరమైన అత్యవసర సంప్రదింపు నంబర్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను క్రమబద్ధమైన క్యూ లైన్లలో పంపిస్తూ మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఓటర్లు మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకురాకుండా సహకరించాలని కోరారు. అమల్లో ఉన్న ఎన్నికల నియమావళి, పోలీసు యాక్ట్ 30, సెక్షన్ 163 నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ఎక్కడా గుంపులు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. పోలింగ్ అనంతరం ఎన్నికల సిబ్బంది, పోలింగ్ సామగ్రి తరలింపునకు తగిన భద్రత కల్పించాలని తెలిపారు.

గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ అనంతరం విజయోత్సవ ర్యాలీలు, ఘర్షణలకు ఆస్కారం లేకుండా నిరంతర నిఘా కొనసాగించాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా, సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు భద్రతపై నమ్మకం కల్పించాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎస్పీ జగదీష్ సూచించారు .

ఘనంగా ముగిసిన ప్రపంచ వారసత్వ వారోత్సవాలు





అంకుశం న్యూస్అనంతపురం, నవంబర్ 25 : అనంతపురం జిల్లాలోని అనంతపురం నగరంలోప్రపంచ వారసత్వ వారోత్సవాలు- 2026 లో భాగంగా ఈరోజు అనగా 25-11-2026 "ప్రపంచ వారసత్వ వారోత్సవ కార్యక్రమాల ముగింపు వేడుకలు" పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు మరియు ప్రదర్శనశాల వద్ద ఘనంగా జరిగాయి. ఈ ముగింపు వేడుకలు రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ అనంతపురం, ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (×చీూూజన), లేడీస్ క్లబ్, ఇన్నర్ వీల్ మరియు ూూదీచీ కళాశాల వారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనంతపురం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ వారసత్వ వారోత్సవాల కార్యక్రమాల యొక్క అంతిమ ఉద్దేశము ఇక్కడితో ఆగకూడదని, తదనంతరం కొనసాగుతూ భావితరాల వారికి సైతం మన వారసత్వ నైతిక విలువలను అందించేందుకు ప్రజలందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా హెరిటేజ్ వాక్ అనే కార్యక్రమాన్ని ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని, మన అనంతపురంలో ఉన్న అనేక రకాల ప్రాచీన కట్టడాల ఘనతను ప్రతి యువత తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వారసత్వ వారోత్సవ కార్యక్రమంలో గత ఆరు రోజులుగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న పెద్దలకు సత్కరించి, వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ మరియు తృతీయ బహుమతులను అసిస్టెంట్ కలెక్టర్ ప్రధానం చేశారు.

- రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ, అనంతపురం సహాయ సంచాలకులు యం. స్వామినాయక్ మాట్లాడుతూ అనంతపురం యొక్క అనంతమైన వారసత్వ వైభవం మ్యూజియంలో దాగిందని, ప్రతి ఒక్కరు కూడా మ్యూజియాన్ని సందర్శించి మన అనంతపురం యొక్క ఘనమైన చరిత్ర తెలుసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో ఉన్న అనేక ప్రాచీన కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ప్రతి పౌరుడు మీద ఉందని ఆయన పేర్కొన్నారు. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మన వారసత్వాన్ని కాపాడుకోవడానికి కేవలం ప్రభుత్వ మాత్రమే కాదు ప్రజలు కూడా బాధ్యతాయుతంగా తీసుకొని మన అనంతపురం చరిత్ర సంస్కృతి వారసత్వం మనమే కాపాడుకుందాం అని ఆయన పిలుపునిచ్చారు. శ్యామసుందర శాస్త్రి, మరియు ప్రొఫెసర్ ఖేజియా రాణి మాట్లాడుతూ, ఆదర్శవంతమైన సమాజాన్ని తీర్చిదిద్దాలంటే ఆదర్శవంతమైన పనులకు మన సంస్కృతి వారసత్వమే మనకు ఆదర్శమని ఆయన పేర్కొన్నారు. ూూదీచీ కళాశాల ప్రిన్సిపాల్ సరిత, లేడీస్ క్లబ్ సెక్రటరీ పద్మనారాయణారెడ్డి, ఇన్నర్ వీల్ సభ్యులు కట్ట శ్యామల మాట్లాడుతూ ఆదర్శవంతమైన యువత, నేటి సమాజానికి చాలా అవసరమని, వారసత్వ పరిరక్షణ మరియు ప్రచారం నిత్యజీవితంలో భాగం చేసుకుంటూ మలుచుకోవాలని, నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోవిందరాజులు గుప్తా, మురళీకృష్ణ, జూటూరు షరీఫ్, హరిజుద్దీన్, సూర్యప్రకాశ్ రెడ్డి, సాధుశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను తనిఖీ చేసిన

జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్





అంకుశం న్యూస్ బత్తలపల్లి, నవంబర్ 25: గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో సన్నద్ధమైందని శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఎం. మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ముదిగుబ్బ మరియు బత్తలపల్లి మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన పంచాయతీ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంపిణీ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్లు, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రి భద్రతను మరియు పంపిణీ తీరును జాయింట్ కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ప్రిసైడింగ్ అధికారులు (ూూలు), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ూూూలు) మరియు ఇతర సిబ్బందితో మాట్లాడి, వారికి కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు.

అధికారులకు జాయింట్ కలెక్టర్ కీలక సూచనలు: పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రిని ఎటువంటి జాప్యం లేకుండా, పక్కా ప్రణాళికతో అందజేయాలని అధికారులను ఆదేశించారు.సామగ్రిని తీసుకున్న వెంటనే సిబ్బంది కేటాయించిన వాహనాలలో తమతమ పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా రూట్ ఆఫీసర్లు పర్యవేక్షించాలన్నారు.స్ట్రాంగ్ రూమ్‌లు మరియు పంపిణీ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.ఎన్నికల విధులకు హాజరైన సిబ్బందికి తాగునీరు, భోజనం మరియు వైద్య సదుపాయాల విషయంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు.ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా సిబ్బంది అందరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి, ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో ముదిగుబ్బ తహసీల్దార్ మహేశ్వర రెడ్డి,బత్తలపల్లి తహసీల్దార్ఈశ్వర్ ప్రసాద్,ఎంపీడీఓలు,పోలీస్ అధికారులు మరియు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల నుంచి తిరుచానూరుకు శ్రీవారి పడి సారె ఊరేగింపు ట్రయల్ రన్ విజయవంతం





భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలి
టీటీడీ జేఈవో డా. ఏ. శరత్

అంకుశం న్యూస్ తిరుపతి నవంబర్ 25 తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు డిసెంబరు 6 నుంచి 14వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు టీటీడీ జేఈవో డా. ఏ. శరత్ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన పంచమితీర్థానికి లక్షలాది మంది భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఈ నేపథ్యంలో బుధవారం తిరుమల నుంచి తిరుచానూరుకు శ్రీవారి పడి సారెను తీసుకువచ్చే ఊరేగింపు మార్గంలో ట్రయల్ రన్ నిర్వహించారు. అనంతరం తిరుచానూరులోని తోళప్ప గార్డెన్స్‌లో అధికారులతో సమావేశమై బ్రహ్మోత్సవాలు, పంచమితీర్థం ఏర్పాట్లపై సమీక్షించారు.

ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి తరఫున తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారికి సమర్పించే పడి సారె మన ప్రాచీన ధార్మిక సంప్రదాయాలకు, తిరుమల--తిరుచానూరు ఆలయాల మధ్య ఉన్న పవిత్ర అనుబంధానికి ప్రతీక అని తెలిపారు. ఈ అపురూపమైన ఆధ్యాత్మిక ఘట్టాన్ని భక్తులు కనులారా వీక్షించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు.

శ్రీవారి సారె ఊరేగింపు మార్గంలో ట్రయల్ రన్

తిరుపతిలోని చెన్నారెడ్డి కాలనీలో ఉన్న శ్రీ వినాయకస్వామివారి ఆలయం నుంచి శ్రీవారి పడి సారె ఊరేగింపు ట్రయల్ రన్ ప్రారంభమైంది. ఏనుగుపై సారెను తీసుకువెళుతూ శ్రీ కోదండరామాలయం, చిన్నబజారు వీధి, పాత హుజూర్ కార్యాలయం, శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయం, శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయం, బండ్ల వీధి, ఆర్టీసీ బస్టాండ్, పద్మావతిపురం, మార్కెట్ యార్డు, శిల్పారామం మీదుగా తిరుచానూరులోని పసుపు మండపానికి చేరుకున్నారు. అక్కడి నుంచి శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఎస్ఈ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, గోశాల డైరెక్టర్ డాక్టర్ శివకుమార్, డిప్యూటీ ఈవోలు హరేంద్రనాథ్, శ్రీమతి శాంతి, శివప్రసాద్, విజివో , అదనపు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల మహిళల వాలీబాల్ ఛాంపియన్‌గా
విజయా కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్

రెండో స్థానంలో సిద్ధార్థ మహిళా కళాశాల

అంకుశం స్పోర్ట్స్ ప్రతినిధివిజయవాడ నవంబర్ 25 నున్నలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల మహిళల వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో విజయా కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, నున్న జట్టు విజేతగా నిలిచింది. శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల (ఎస్‌డీఎస్ఎంఎస్) జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది.

ఈ పోటీల్లో విజయవాడలోని ఎస్ఆర్ఆర్ & సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆటానమస్) జట్టు తృతీయ స్థానాన్ని, ఆతిథ్య వికాస్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు చతుర్థ స్థానాన్ని దక్కించుకున్నాయి.

నున్నలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో నాకౌట్ కమ్ లీగ్ పద్ధతిలో ఈ పోటీలను నిర్వహించారు. వికాస్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీ ఎన్. నర్సిరెడ్డి గారు వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచి మొత్తం ఏడు కళాశాలల జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి.

నాకౌట్ దశలో ప్రతిభ కనబరిచిన నాలుగు జట్లు లీగ్ దశకు అర్హత సాధించాయి. లీగ్ మ్యాచ్‌లలో విజయా కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి ప్రత్యర్థి జట్లపై విజయాలు సాధించి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి వికాస్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ డా. డి. సురేష్ అధ్యక్షత వహించారు.



ముఖ్య అతిథిగా పాల్గొన్న వికాస్ విద్యాసంస్థల చైర్మన్ ఎన్. నర్సిరెడ్డి విజేతలకు ట్రోఫీలు, పతకాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో కృష్ణా విశ్వవిద్యాలయ మహిళల వాలీబాల్ సెలక్షన్ కమిటీ సభ్యులు కె. కోటేశ్వరరావు, డా. ఎన్. హేమ, వికాస్ బి.పి.ఎడ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి. రఘునాథ్, ఫిజికల్ డైరెక్టర్ డా. అమ్జద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, విద్యార్థినుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, జట్టుగా ఆడే తత్వాన్ని పెంపొందించేందుకు ఇలాంటి అంతర్ కళాశాలల పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.

పంచాయతీ ఎన్నికల పంపిణీ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్

అంకుశం న్యూస్ ధర్మవరం, నవంబర్ 25: రాబోయే పంచాయతీ ఎన్నికల నిర్వహణను సజావుగా, పారదర్శకంగా మరియు ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ మరియు స్వీకరణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మైదానంలోని వివిధ విభాగాలను పరిశీలించి, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ సిబ్బందికి బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు మరియు ఇతర ఎన్నికల సామగ్రిని పంపిణీ చేసేటప్పుడు ఎటువంటి గందరగోళం తలెత్తకుండా రూట్ మ్యాప్‌ల వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి. పోలింగ్ సిబ్బందిని సకాలంలో ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరవేసేందుకు సరిపడా బస్సులు, ఇతర వాహనాలను సిద్ధంగా ఉంచాలి. వాహనాల పార్కింగ్ కోసం మైదానంలో ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలి. దూర ప్రాంతాల నుండి విధులకు హాజరయ్యే పోలింగ్ సిబ్బందికి తాగునీరు, భోజన వసతి, నిరంతర విద్యుత్ సరఫరా, మరియు ప్రాథమిక వైద్య శిబిరం (మెడికల్ క్యాంప్) అందుబాటులో ఉండేలా చూడాలి. ఎన్నికల సామగ్రి భద్రత దృష్ట్యా కేంద్రం చుట్టూ పటిష్టమైన పోలీసు బందోబస్తు మరియు సీసీటీవీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయాలి. ఎన్నికల సంఘం నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డి,ధర్మవరం తహశీల్దార్ దేవరాజు,స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు మరియు ఎన్నికల విభాగపు సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికలు ముగిసినా డా.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఎందుకీ వివక్ష?

అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 25 ధర్మవరం పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ నాయకుల విగ్రహాలను ఎన్నికల నిబంధనల ప్రకారం ముసివేయడం జరిగింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయినప్పటికీ ఎన్టీఆర్ విగ్రహాన్ని మాత్రమే తెరిచి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఇంకా కప్పి ఉంచడం అధికారుల ద్వంద్వ వైఖరికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఎన్నికలు ముగిసిన తర్వాత అన్ని విగ్రహాలపై ఒకే విధమైన నిబంధనలు అమలు చేయాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులు, ఎన్నికల అధికారులు మరియు సంబంధిత అధికారులపై ఉంది. మరి డా.రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఇప్పటికీ ఎందుకు తెరవలేదు? అధికారులు తక్షణమే స్పందించి, అన్ని విగ్రహాలపై సమానత్వంతో వ్యవహరించి,డా.వైఎస్సార్ గారి విగ్రహానికి ఉన్న ముసుగును తొలగించాలని డిమాండ్ చేస్తున్నాం.

మర్తాడు గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీలకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అభినందనలు



అంకుశం న్యూస్,అనంతపురం,నవంబర్:26 అనంతపురం ఎంపీ క్యాంపు కార్యాలయంలో గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన ఆవుల లక్ష్మి ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికైన సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి, వార్డు సభ్యులను అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ అభినందించారు. అలాగే మర్తాడు గ్రామానికి చెందిన ఎంపీటీసీ యు.శాంతి, ఎంపీటీసీ-2 సుబ్బరాయుడు విజయం సాధించినందుకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వారిని అభినందించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గార్లదిన్నె మండల కన్వీనర్ పాండు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మర్తాడు గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆవుల లక్ష్మి నీ నూతన వార్డు సభ్యులను ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఘనంగా సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు.....



అంకుశం న్యూస్,గార్లదిన్నె,నవంబర్ :26 గార్లదిన్నె మండలం,మర్తాడు గ్రామ పంచాయతీ సర్పంచు గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆవుల లక్ష్మి ను శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఘనంగా సన్మానించారు.నూతన వార్డు సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలియజేసారు, గ్రామ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారూ. అలాగే వీరితోపాటు పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల గురించి చర్చించడం జరిగింది. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచార తీరు గురించి ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ టిడిపి కార్యకర్తలతో మాట్లాడారూ.

మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు కు సర్వం సిద్ధం
ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోండి..
జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్..



అంకుశం న్యూస్అనంతపురం, నవంబర్ 25 : అనంతపురం జిల్లాలో కొన్ని ప్రాంతాల్లోలిస్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా నవంబర్ 26వ తేదీన నిర్వహించే మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు – 2026కు సర్వం సిద్ధం చేయడం జరిగింది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల పోలింగ్ నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరిగింది.లి

– మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ కోరారు.

జిల్లాలో 3 రెవెన్యూ డివిజన్లు, 31 మండలాలు, 577 గ్రామపంచాయతీలు ఉన్నాయి.లిమొదటి విడతలో ఎన్నికలు జరిగే డివిజన్ల వివరాలు : కళ్యాణదుర్గం డివిజన్, అనంతపురం డివిజన్..మొదటి విడతల ఎన్నికలు జరిగే మండలాలు :లి 13

– మొదటి విడతలో ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాలు : 2,388

– ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో మద్యం దుకాణాలను మూసి వేయడం జరిగింది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరిగింది. 26వ తేదీ గురువారం జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా కళ్యాణదుర్గం మరియు అనంతపురం రెవిన్యూ డివిజన్లకు సంబంధించి వివిధ మండలాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి బుధవారం ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామాగ్రితో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఆర్టీసీ బస్సులలో బయలుదేరి వెళ్లారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగింది. పోలింగ్ కేంద్రాలవద్ద ఓటర్లు తోపులాటకు గురికాకుండా బ్యారికెడింగ్ ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు అన్ని మౌలిక వసతులు కల్పించి ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ సాగేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

పార్లమెంటరీ కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.



అంకుశం న్యూస్ న్యూఢిల్లీ నవంబర్ 25 న్యూఢిల్లీలోని భారత పార్లమెంట్ హౌస్ అనెక్స్‌లో కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పార్లమెంటరీ కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొన్నారు.

64 వ వార్షికోత్సవశీ జరుపుకున్న పాపులర్ షూ మార్ట్



అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 25 ధర్మవరం పాపులర్ షూ మార్ట్ కేంద్ర కార్యాలయం విజయవాడ ఆధ్వర్యంలో స్థానిక బ్రాంచ్ 64 వ వార్షికోత్సవ వేడుకలు జరుపుకుందని ధర్మవరం బ్రాంచ్ మేనేజర్ బత్తల ఆంజనేయులు తెలియజేసారు.తమ సంస్థ ద్వారా అనేక చోట్ల పలువురు ఉపాధి పొందుతున్నారని వ్యవస్థాపకులు దివంగత చుక్కపల్లి పిచ్చయ్య కు చుక్కపల్లి విజయ్ కుమార్ లకు ఘనంగా నివాళులు అర్పించారు ప్రస్తుతం అధినేత చుక్కపల్లి అరుణ్ కుమార్ కు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో స్థానిక సిబ్బంది కె. రాజేష్ జి. శిల్ప, డి. రామాంజి తదితరులు పాల్గొన్నారు.